కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- పాల్గొన్న ఆయా పార్లమెంటు నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో వికాస్‌రాజ్

రంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి ఆయా పార్లమెంటు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా చేపట్టాల్సిన చర్యల గురించి సీఈవో ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మలి విడత ర్యాండమైజేషన్ జరిపి, ఆ జాబితాను అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని కేటాయించాలన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటల వరకు అందరూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకునేలా చూడాలని, ఈ మేరకు అభ్యర్థులు, వారి తరపున హాజరయ్యే ఏజెంట్లకు కూడా సమాచారం అందించాలని సూచించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంభించాలని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన అన్ని సదుపాయాలు కౌంటింగ్ సెంటర్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని, జనరేటర్‌ను సైతం అందుబాటులో ఉంచాలని సూచించారు.

రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులు మినహా ఇతరులెవ్వరూ కౌంటింగ్ కేంద్రం లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు, అవసరమైన పక్షంలో రీకౌంటింగ్ నిర్వహణ గురించి సిబ్బందికి శిక్షణా తరగతుల సందర్భంగా స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా, సాఫీగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పంపించాలని, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించే సమయంలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరగాలని, కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. తుది ఫలితాల వెల్లడి తరువాత కౌంటింగ్ సెంటర్ వద్ద పక్కాగా ఆంక్షలు అమలయ్యేలా చూడాలని, పూర్తి స్థాయిలో నిబంధనలకు లోబడి సంబురాలు నిర్వహించుకునేందుకు మాత్రమే అనుమతించాలని సీఈవో స్నారు.

ఎలాంటి అనుమానాలు, వివాదాలు, గందరగోళానికి తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, చేవెళ్ల డీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి

వికారాబాద్ : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌వారీగా కౌంటింగ్ హాల్‌లో నిర్దేశిత రౌండ్ల వారీగా కౌంటింగ్‌ను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని, ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత సంబంధిత టేబుళ్ల కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, అనంతరం ఈవీఎం యంత్రాల ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ సకాలంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద హై స్పీడ్‌తో కూడిన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాలు ప్రకటించేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలించి, కౌంటింగ్ నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం ఈవీఎం యంత్రాలను గోడౌన్‌కు తరలించేందుకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాస్, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రావతరణ వేడుకలకు ఘన ఏర్పాట్లు

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ) : జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో పని చేస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకల్లో అధికారులు, మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. పోలీసు గౌరవ వందనంతోపాటు వేడుకల్లో పోలీసు బందోబస్తుకు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వేదికను అందంగా అలంకరించాలన్నారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏవో ప్రమీలారాణి, సీపీవో సౌమ్య పాల్గొన్నారు.

10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు

రంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో జూన్ 3 నుంచి 16 వరకు జరుగనున్న 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రంగారెడ్డి డీఈవో సుశీందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 20 పరీక్షా కేంద్రాల్లో 5,291 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా సమయానికి గంట ముందు నుంచి పరీక్ష హాల్లోకి అనుమతిస్తారని, విద్యార్థులు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతించబడుతుందని చెప్పారు. పరీక్షా సమయం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని, హాల్ టికెట్లను సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల నుంచి తీసుకోవాలన్నారు. కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందుగానే చూసుకోవాలని ఆయన సూచించారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్, మే 28 : మే 24 నుంచి ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు మొదటి సంవత్సరం జనరల్‌లో 2,696 మంది విద్యార్థులకు 2,571 మంది, ఒకేషనల్‌లో 322 మంది విద్యార్థులకు 309 మంది హాజరయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 1,313 మందికి 1,253, ఒకేషనల్‌లో 94 మందికి 90 మంది హాజరయ్యారు. 4 గైర్హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. పరీక్షలు జూన్ 3 వరకు జరుగనున్నట్లు చెప్పారు.

ఉస్మాన్‌సాగర్ కాలనీలో పర్యటిస్తూ అధికారులతో సమస్యలపై ఆరా తీస్తున్న కలెక్టర్ శశాంక

వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు తప్పనిసరి

రంగారెడ్డి, మే 28 (నమస్తే తెలంగాణ) : వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. రాబోవు వర్షాకాలం దృష్ట్యా జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌సాగర్ కాలనీని మంగళవారం కలెక్టర్ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఉస్మాన్‌సాగర్ కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ జల్‌పల్లి, బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2020లో బూరాన్‌ఖాన్ చెరువు పరిసర ప్రాంతంలో ముంపునకు గురైన ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని రాబోవు వర్షాకాలంలో బూరాన్‌ఖాన్ చెరువుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. చెరువులో గుర్రపు డెక్క, నాచును తొలగించాలని.. పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలన్నారు. అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకొని అక్కడి ప్రజలకు వర్షాకాలంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ, దోమల బెడద, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

బిర్యాని తిని 8 మంది ఆస్పత్రిపాలు

కలుషిత ఆహారం వల్లే ఫుడ్ పాయిజన్ అంటున్నవైద్యులు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేందర్

నందిగామ, మే 28 : ఒక వ్యక్తి తన పెళ్లి రోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి రెస్టారెంట్‌కు వెళ్లాడు. బిర్యాని తిని ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలు కావడంతో ఆస్పత్రిపాలైన ఘటన నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన కావలి నరేందర్ ఈ నెల 22న తన పెళ్లి రోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి తొమ్మిది గంటల సమయంలో షాద్‌నగర్‌లోని సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌కు వెళ్లి మండీ బిర్యాని తిన్నారు. ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే ఒకరి తర్వాత ఒకరికి వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నరేందర్‌కు రక్తపు వాంతులు కావడంతో ఐసీయూలో ఉన్నాడు. ఆయన భార్య మంగమ్మ, కుటుంబ సభ్యులు దీక్షిత, తన్విక, అనిరుధ్, అభిలాష్, జ్యోత్స్న, సాయి శ్రీకర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. నాణ్యత, పరిశుభ్రత పాటించకుండా నిర్వహిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, భోజన ప్రియులు డిమాండ్ చేస్తున్నారు.

సాయిబాబా రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

షాద్‌నగర్ : విషపూరిత ఆహార పదార్థాలు ఉన్నాయనే ఫిర్యాదుతో మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని సాయిబాబా రెస్టారెంట్ హోటల్‌లో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి ఆహార పదార్థాలను పరిశీలించారు. రెస్టారెంట్‌లోని ఆహార పదార్థాల నిల్వ, వినియోగిస్తున్న వస్తువుల నాణ్యత, వంటి గది నిర్వహణ, పాల పదార్థాల నాణ్యత, మాంసం నిల్వలు వంటి వివరాలను తెలుసుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. రెస్టారెంట్‌లో వండిన బిర్యాని శాంపిల్స్‌ను తీసుకెళ్లారు. కొన్ని రోజుల క్రితం రెస్టారెంట్‌లో మండీ బిర్యాని తిన్న పలువురు అనారోగ్యంపాలయ్యారని ఫుడ్ సెఫ్టీ అధికారి ఉదయ్ కిరణ్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలను పాటించకుండా, నాసిరకం ఆహారాన్ని వడ్డిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనుమతులు లేకుండా హోటళ్లను నిర్వహించరాదనే విషయాన్ని వ్యాపారులు గ్రహించాలని ఆయన సూచించారు.

సాయిబాబా రెస్టారెంట్‌లో బిర్యానిని పరిశీలిస్తున్న అధికారులు

సురవరం జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

సీనియర్ పాత్రికేయుడు ఉడయవర్లకు సురవరం ప్రతాప్‌రెడ్డి అవార్డును బహూకరిస్తున్న డా.కేఏ వరప్రసాద్‌రెడ్డి, కె.విరాహత్‌అలీ

శాంతా బయోటెక్ ఎండీ డాక్టర్ కేఏ వరప్రసాద్‌రెడ్డి

రవీంద్రభారతి, మే 28 : తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పూర్తి జీవిత చరిత్రను నేటి తరానికి అందించడానికి పాఠ్యాంశాల్లో చేర్చాలని శాంతా బయోటెక్ ఎండీ డాక్టర్ కేఏ వరప్రసాద్‌రెడ్డి కోరారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి సురవరం పేరుతో ప్రత్యేక సాహిత్య అవార్డును ప్రదానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాహితీ పురస్కారం-2024ను ప్రముఖ పాత్రికేయుడు ఉడయవర్లకు ప్రదానం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.కేఏ వరప్రసాద్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. తెలంగాణ సాహిత్య రంగంలో కొత్త చరిత్రను సృష్టించిన వ్యక్తి సురవరం ప్రతాప్‌రెడ్డి అని కొనియాడారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్‌అలీ మాట్లాడుతూ.. సురవరం ప్రతాప్‌రెడ్డి, షోయబుల్లా ఖాన్ నేటి జర్నలిస్టులకు ఆదర్శప్రాయంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి, సురవరం పుష్పలత, చెన్నయ్య పాల్గొన్నారు.

యానిమల్ బయో టెక్నాలజీలో ఫౌండేషన్ డే

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): గౌలిదొడ్డిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(నాయబ్)లో 13వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పశు సంవర్ధక శాఖ మాజీ సెక్రటరీ తరుణ్ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశు సంపదను వృద్ధి చేయడంలో విప్లవాత్మక పరిశోధనలకు నాయబ్ వేదికగా నిలుస్తుందని కొనియాడారు. అందుబాటులోకి వచ్చిన బయో టెక్నాలజీ వన్య ప్రాణుల సంరక్షణలో కీలకం గా మారిందన్నారు. అంతు చిక్కని జంతు సంబంధిత వ్యాధుల నియంత్రణలో విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయబ్ డైరెక్టర్ డా.తారు శర్మ, పరిశోధకులున్నారు.

నోటాకు అధిక ఓట్లు వస్తే రీ పోల్

- నోటాను కల్పిత అభ్యర్థిగా ప్రకటించాలి
- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి, చిత్రంలో పద్మనాభరెడ్డి

ఖైరతాబాద్, మే 28 : ఓటరు తనకు ఏ అభ్యర్థి నచ్చకపోతే నోటాకు ఓటు వేస్తారని, ఒక వేళ నోటాకు అధిక ఓట్లు వస్తే వెంటనే ఆ నియోజకవర్గంలో రీపోల్ చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అధ్యక్షతన పంచాయతీ ఎన్నికల్లో నోటా అమలుపై జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి హాజరై ప్రసంగించారు. నోటా అమలు తర్వాత జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో నోటాకు సుమారు 1.5 శాతం ఓట్లు వచ్చాయని, నోటాకు అధిక ఓట్లు వచ్చినా రీ పోల్ జరిగే వెసులుబాటు లేదన్నారు. ఈ విషయంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నదని, పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటాను ఓ కల్పిత అభ్యర్థిగా ప్రకటిస్తూ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఇతర అభ్యర్థుల కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే రిపోల్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ రీ పోల్‌లో మొదటి బరిలో ఉన్న అభ్యర్థులెవరూ పోటీ చేయడానికి వీలు లేదన్నారు. నోటాను బలపర్చడానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చేస్తున్న కృషిని అభినందించారు. పద్మనాభరెడ్డి మాట్లాడుతూ వచ్చే రెండు మూడు నెలల్లో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నదని, 2019లో జరిగిన ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికల్లో సుమారు 16 శాతం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఇందులో అధికంగా వేలం పాటలో గెలిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారని, ఇక్కడ గ్రామ కమిటీలు, కుల సంఘాలు రాజ్యాంగేతర శక్తులుగా పనిచేస్తూ సర్పంచ్ పదవులను వేలం వేస్తున్నారని తెలిపారు. ఏక గ్రీవ ఎన్నికల వల్ల సామాన్యులు ఓటు హక్కును కోల్పోతారని, ఈ పరిస్థితి మారాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు బి.మన్మథరెడ్డి, విశ్రాంత డీజీపీ గోపాల్ రెడ్డి, లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్ రావు, ఎన్నికల నిఘా వేదిక ప్రతినిధి వీవీ రావు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

- ఏకకాలంలో తనిఖీలు
- రూ.1,37,440 నగదు, పలు ఫైల్స్ స్వాధీనం
- సిబ్బందిని, ఏజెంట్లను ప్రశ్నించిన అధికారులు

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో నాలుగు ఆర్టీవో కార్యాలయాల్లో ఏకకాలంలో ఏసీబీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నగరంలోని మలక్‌పేట, బండ్లగూడ, టోలిచౌకి, మణికొండ కార్యాలయాల్లో సోదాలు చేశారు. ఈ క్రమంలో ఆర్టీఏ కార్యాలయాల్లోకి సేవల కోసం వచ్చిన దరఖాస్తుదారులను నిలిపివేశారు. సోదాల్లో భాగంగా లక్షా ముప్పై ఏడు వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అనధికారికంగా కార్యాలయాల్లో సంచరిస్తున్న 27 మంది ఏజెంట్లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి లైసెన్స్ పత్రాలు, రెన్యూవల్స్, ఫిట్‌నెస్ పత్రాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు కొందరు ఉద్యోగులు యూనిఫాం లేకుండా కార్యాలయాల్లో పనులను సక్రమబెడుతున్నట్లు అధికారులు గుర్తించారు. కార్యాలయాల్లో ట్రాన్సాక్షన్ డీడీలు మాత్రమే ఉండాలి. అందుకు విరుద్ధంగా నగదు ఉండటాన్ని గుర్తించారు. టోలిచౌకి ఆర్టీఏ కార్యాలయంలో ఏడుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. రూ. 43,360 స్వాధీనం చేసుకున్నారు. అక్కడి సిబ్బందిని విచారించారు. ఇక మలక్‌పేట లోని కార్యాలయంలో ఏసీబీ సిటీ రేంజ్ డీఎస్పీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గదిలోని సజ్జపైన ఒక పర్సులో రూ.22వేలను గుర్తించి, ఆ సొమ్మును స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు. బండ్లగూడలో కూడా రూ.48,370, మణికొండ కార్యాలయంలో రూ.23,710లను స్వాధీనం చేసుకున్నారు. దరఖాస్తుదారులు మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని ఏసీబీ అధికారులు సూచించారు.

10 స్టార్టప్‌లు ఎంపిక

సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ) : టీ హబ్ చేపట్టిన స్కిల్ ఇండియా డిజిటల్ యాక్సిలరేటర్ కార్యక్రమానికి 10 స్టార్టప్‌లను ఎంపిక చేశామని టీ హబ్ సీఈవో ఎం.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌డీసీ, హెచ్‌డీఎఫ్‌సీ సహకారంతో వివిధ రంగాల్లో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 369 దరఖాస్తులు రాగా అందులో ఉత్తమంగా ఉన్న 10 స్టార్టప్‌లను ఎంపిక చేశామని తెలిపారు. ఈ జాబితాలో కొనోమియల్, కర్మిన్, క్రియాన్ వర్సిటీ, హమ్‌లాగ్‌జాబ్స్, ద్రిధి ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎడ్యుబక్, ఆన్‌లైన్ సాథీ, హౌబీ, స్కైస్కిల్ అకాడమీ, ది క్యూబ్ స్టార్టప్‌లు ఉన్నాయని, వీటికి అవసర మైన నిధులను హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన్ స్టార్టప్ గ్రాంట్స్‌ను అందిస్తుందని ఆయన తెలిపారు.

బీబీఏ కోర్సుల పరీక్షా ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 28 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీబీఏ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీబీఏ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీలను మార్చినట్లు చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామరాజు

సిటీబ్యూరో , మే 28(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రామరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ స్టేట్ మీడియా సెక్రటరీ రామచంద్రం తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, 317 జీవో బాధితులకు తక్షణ న్యాయం, పెండింగ్ డీఏలు విడుదల, పీఆర్సీ అమలుపై చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎంకే రాజు, జానకీ బాయి, మల్లేశ్, ప్రతాప్, సైదులు పాల్గొన్నారు.

బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ కార్యవర్గం

సుల్తాన్‌బజార్, మే 28 : డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బోధనాసుపత్రుల వైద్యుల జేఏసీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ మేరకు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో వివిధ మెడికల్ కళాశాలల వైద్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డైరెక్ట